ప్రజాశక్తి

శుక్రవారం 27 అక్టోబర్ 2023

5

అనంతపురం

రెక్కాడితే గానీ డొక్కాడని జీవితం వారిది. మండేకడుపు నింపుకోవాలంటే కూలి పనులకు వెళ్లాల్సిందే. సొంతూరులో పనులు లేక పక్క రాష్ట్రానికి వలసెళ్తుంటారు. ఇంటి పెద్దకు తోడుగా పనికెళ్తే నాలుగు రూకలొస్తాయని భర్తతో పాటు భార్య, నాన్నతో పాటు కుమారుడు ఇలా అందరూ పనుల కోసం పొట్టచేతబట్టుకుని వెళ్తుంటారు. కుటుంబ పోషణ, పిల్లలను ప్రయోజకులను చేయాలన్న తాపత్రయంతో ఉన్న ఊరిని వదిలి పరాయి ప్రాంతానికి వెళ్లే జీవనం వారిది. శ్రమను నమ్ముకుని జీవన పోరాటం సాగిస్తున్న వారి కుటుంబాల్లో పెనుప్రమాదం చీకట్లను నింపింది. ఊహించని పరిణామం శ్రమజీవుల ఇంట మృత్యుఘోషను మోగించింది. దసరా పండుగకు సొంతూరికి వచ్చి, తిరిగి వలస బాటపట్టిన వారికి అదే చివరి రోజు అయ్యింది. పొద్దు పొడవకముందే బంధువులకు వెళ్లొస్తామని మోములో చిరునవ్వుతో వెళ్లిన శ్రమజీవుల బతుకు విధి విసిరిన మృత్యుపాశానికి బలైంది. కర్నాటక రాష్ట్రం చిక్బాళాపూర్ వద్ద గురువారం వేకువజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 13 మంది మరణించారు. ఇందులో శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన వారు 10 మంది ఉండగా, కర్నాటక ప్రాంతానికి చెందిన వారు ముగ్గురు ఉన్నారు. మృతి చెందిన వారంతా కూలీలే కావడం బాధాకరం. వీరిలో భార్యాభర్త, తల్లీకుమారులు ఉన్నారు. పేద కూలీల ఇంట ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది.

చిక్బాళాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ కిందకు దూరిపోయిన సుమో

వలసెళ్లిన ప్రాణం..!

- కూలీలను కమ్మేసిన మృత్యువు
- చిక్బాళాపూర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- ఆగివున్న లారీని ఢీ కొన్న సుమో
- 13 మంది మృతి
- మృతులంతా వలసకూలీలే
- 10 మంది సత్యసాయి జిల్లా వాసులు, ముగ్గురు కర్నాటక వాసులు
- కూలీల ఇంట పెను విషాదం
- చీకట్లు నింపిన దసరా పండుగ
- దట్టమైన పొగమంచే ప్రమాదానికి కారణం

ప్రమాదంలో మృతి చెందిన వలస కూలీలు

ప్రజాశక్తి- గోరంట్ల రూరల్, గోరంట్ల

శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కలిగిరి గ్రామానికి చెందిన హరిజన నరసింహులు(45) సుమో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈయన గురువారం వేకువజామున 4గంటల సమయంలో వలస కూలీలను తన సుమోలో బెంగుళూరుకు తీసుకెళ్లేందుకు గోరంట్ల నుంచి బయల్దేరాడు. గోరంట్ల నుంచి 11 మందితో వెళ్లగా మార్గమధ్యంలో మరో నలుగురిని ఎక్కించుకున్నాడు. సుమో చిక్‌బళాపూర్ జాతీయ రహదారిపై వెళ్తుండగా దట్టంగా ఉన్న పొగమంచులో ముందు నిలిపిన ఆయిల్ ట్యాంకర్ లారీని గుర్తించకుండా ఢీకొన్నాడు. వేగంగా వెళ్లి లారీని ఢీకొనడంతో సుమో దాని కిందకు దూరి పోయింది. అందులో ఉన్న వారు ఒక్కసారిగా లారీ, సుమో సీట్ల కింద ఇరుక్కుపోయారు. ఈ ప్రమాదంలో సుమోలో ఉన్న గోరంట్ల మండలం వానవోలు గ్రామానికి చెందిన బోయ వెంకటాద్రి(27), ఆయన భార్య బోయ లక్ష్మి(23), కొత్తచెరువు మండలం గోరంట్లపల్లి గ్రామానికి చెందిన పవన్(32), గోరంట్ల మండలం కలిగిర గ్రామానికి చెందిన డ్రైవర్ హరిజన నరసింహులు(45), ఓబులదేవర చెరువు మండలం నవాబుకోట గ్రామానికి చెందిన ఎ.వెంకట నారాయణ(51), ఈయన భార్య వెంకట సుబ్బమ్మ(48), చిలమత్తూరు మండలం మొరంపల్లి గ్రామానికి చెందిన గొల్ల గణేష్(17), ఓబుళదేవరచెరువు మండలం మలకవారిపల్లి గ్రామానికి చెందిన నారాయణప్ప(50), పెనుకొండ మండలం గోనిపెంట గ్రామానికి చెందిన గొల్ల శాంతమ్మ (37), ఆమె కుమారుడు గొల్ల రాజవర్ధన్(15), కర్నాటక రాష్ట్రం మరగనిగుంట్ల గ్రామానికి చెందిన మంగళ మూర్తి(42), కర్నాటక రాష్ట్రం దొడగట్టకు చెందిన నేసే అరుణ(38), ఈమె కుమారుడు నేసే రుత్విక్ సాయి(7)లు మరణించారు. మృతుల్లో గోరంట్ల మండలానికి సంబంధించి ముగ్గురు, ఓబుళదేవచెరువు మండలంలో ముగ్గురు, పెనుకొండ మండలంలో ఇద్దరు, చిలమత్తూరు మండలంలో ఒకరు, కొత్తచెరువులో ఒకరు, కర్నాటక రాష్ట్రానికి చెందిన ముగ్గురు ఉన్నారు. ప్రమాద విషయం తెలియగానే కర్నాటక పోలీసులు, సహాయక సిబ్బంది వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. మృతుల వద్ద ఉన్న గుర్తింపు కార్డులను బట్టి సమాచారాన్ని వారి కుటుంబ సభ్యులు, సత్యసాయి జిల్లా పోలీసులకు తెలియజేశారు. దట్టమైన పొగ మంచు ఉండడం వల్ల ముందు ఉన్న లారీని గుర్తించలేకనే ఈ ప్రమాదం జరిగినట్లు చిక్‌బళాపూర్ ఎస్పీ డిఎల్.నగేష్ మీడియాకు తెలియజేశారు. మృతదేహాలను పోస్టుమార్టం అనంతరం వారి స్వగ్రామాలకు తరలించారు.

బతుకుదెరువు కోసం వెళ్లి...

గోరంట్ల మండలం వానవోలు గ్రామానికి చెందిన బోయ వెంకటాద్రి భార్య బోయలక్ష్మిలు గతేడాది గ్రామం వదిలి బెంగుళూరుకు వలసెళ్లారు. వంకసంద్రలో ఒక చిన్న ఇల్లు అద్దెకు తీసుకుని అక్కడ జీవనం సాగించేవారు. వెంకటాద్రి పెయింటర్ పనికి వెళ్తుండగా, భార్య లక్ష్మి గార్మెంట్ పరిశ్రమలో పనికి వెళ్లేది. దసరా పండుగ సందర్భంగా వీరు సొంతూరుకు వచ్చారు. పండుగను ముగించుకుని బెంగుళూరుకు వెళ్తుండగా ప్రమాదంలో ఇద్దరూ మరణించారు. గ్రామంలో గత ఐదు సంవత్సరాల నుంచి వ్యవసాయ, ఉపాధి పనులు సరిగా లేని కారణంగా బతుకుదెరువు కోసం కుమారుడు కోడలు బెంగుళూరుకు వెళ్లారని, ఇక్కడే పని ఉంటే వారు చనిపోయి ఉండేవారు కారంటూ వెంకటాద్రి తండ్రి తండ్రి నాగప్ప కన్నీటి పర్యవంతం అయ్యారు.

మృత్యువులోనూ వీడని మూడుముళ్ల బంధం

ఓడీసీ్స మండలం నవాబుకోట గ్రామానికి చెందిన వెంకటనారాయణ, ఆయన భార్య వెంకటసుబ్బమ్మలు పొట్టకూటికోసం బెంగళూరుకు వలస వెళ్లారు. వీరి కుమారుడు గోరంట్లలోని చౌడేశ్వరి కాలనీలో చేనేత కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. దసరా పండగ కావడంతో కుమారుని ఇంటికి వెంకటనారాయణ, వెంకటసుబ్బమ్మలు వచ్చారు. పండుగలో కుటుంబ సభ్యులతో సంతోషంగా గడిపారు. పండుగ ముగించుకుని గురువారం ఉదయం టాటా సుమోలో బెంగళూరుకు వెళ్తున్న వీరు ప్రమాదానికి గురై మరణించారు.

మృత్యుఒడికి తల్లీకుమారుడు

పెనుకొండ: మండల పరిధిలోని గోనిపెంటకు చెందిన తల్లీకుమారుడు శాంతమ్మ, కుమారుడు రాజవర్ధన్‌లు సొంతూరులో పనులు లేక ఐదు సంవత్సరాల క్రితం బెంగుళూరుకు వలసెళ్లారు. హొంగసంద్రం వద్ద శాంతమ్మ, భర్త శంకరప్ప, కుమారులు శ్రీనివాసులు, రాజవర్ధన్‌లు కూలి పనులకు వెళ్లేవారు. దసరా పండుగ కావడంతో సొంతూరు గోనిపెంటకు వచ్చారు. పండగను ముగించుకుని శాంతమ్మ అతని కుమారుడు రాజవర్ధన్‌తో కలిసి బుధవారం గోరంట్ల మండలం కాటేపల్లిలోని తన పుట్టింటికి వెళ్లింది. శంకరప్ప కుమారుడు శ్రీనివాసులు వారి స్వగ్రామంలో సొంతపని నిమిత్తం నిలిచిపోయారు. గురువారం ఉదయం శాంతమ్మ కుమారుడు రాజవర్ధన్‌తో బెంగుళూరుకు సుమోలో బయల్దేరారు. మార్గమధ్యంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వీరిద్దరూ మరణించారు.

డ్రైవర్‌గా కుటుంబాన్ని పోషిస్తూ...

గోరంట్ల మండలం కలగేరి గ్రామానికి చెందిన హరిజన నరసింహులు డ్రైవర్ వృత్తిని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోజూ ప్రయాణికుల రద్దీని బట్టి ఒకటి రెండుసార్లు గోరంట్ల నుంచి బెంగళూరులోని వంగసంద్రకు సుమోను తీసుకుని వెళ్లేవాడు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున గోరంట్ల బస్టాండ్ ఆవరణంలో 13 మందిని ఎక్కించుకుని వెళ్తున్న క్రమంలో ప్రమాదంలో ఈయన మరణించాడు. పెద్ద దిక్కును కోల్పోవడంతో ఈయన కుటుంబం దిక్కులేని వారయ్యారు.

సీమంతానికి వచ్చి...

గోరంట్ల మండలం చుండూరువాండ్లపల్లి గ్రామానికి చెందిన నేసే మల్లికార్జున కుమార్తె అరుణ ఆమె ఏడేళ్ల కుమారుడు రిత్విక్ సాయితో కలిసి బుధవారం నాడు బెంగళూరు నుంచి చెల్లెలు సీమంతం కోసం వచ్చారు. సీమంతం అయిన అనంతరం గురువారం తెల్లవారుజామున కుమారుడితో కలిసి బెంగుళూరు వెళ్లేందుకు గోరంట్ల బస్టాండ్ ఆవరణలో ఉన్న సుమోలో ఎక్కారు. ప్రమాదంలో తల్లీ కుమారుడు ఇద్దరూ మరణించారు.

పెదనాన్నను చూసేందుకు వెళ్తూ..

చిలమత్తూరు : మండల పరిధిలోని మొరంపల్లి గ్రామానికి చెందిన గొల్ల గణేష్ చాల సంవత్సరాల క్రితం గోరంట్ల మండల కేంద్రంకు వలస వెళ్లి అక్కడే ఉంటున్నారు. ఇంటర్ విద్యను కూడా గణేష్ గోరంట్లనే పూర్తి చేశాడు. దసరా సందర్భంగా గోరంట్లకు వచ్చిన తన సమీప బందువులతో కలిసి పెద్దనాన్నను చూసేందుకు సుమోలో బెంగుళూరుకు వెళ్తుండగా ప్రమాదంలో మృతి చెందాడు.

భార్యను పుట్టింట్లో వదిలి వెళ్లి..

బాగేపల్లి తాలూకా మార్గానుగుంట్ల గ్రామానికి చెందిన మంగళ నరసింహమూర్తి వత్తి రీత్యా బెంగళూరులో నివాసం ఉంటున్నారు. ఈయన గోరంట్లలో పెళ్లి చేసుకున్నాడు. దసరా పండగ సందర్భంగా భార్యా పిల్లల్ని గోరంట్ల మండలం మల్లాపల్లి గ్రామంలోని భార్య పుట్టింట్లో వదిలేందుకు వచ్చాడు. గురువారం ఉదయం బెంగళూరుకు టాటా సుమోలో వెళ్తుండగా ఈయన మరణించాడు.

భార్యను వదిలి... ఉద్యోగానికి వెళ్తూ..

కొత్తచెరువు : మండల పరిధిలోని గోరంట్లపల్లి గ్రామానికి చెందిన నాగభూషణ కుమారుడు పవన్ బెంగుళూరులోని అపెక్స్ కంపెనీలో విధులు నిర్వహిస్తున్నాడు. బెంగుళూరులో ఉంటూ ఈయన విధులు నిర్వహించేవాడు. దసరా పండుగ అనంతరం గోరంట్లలో తన భార్యను పుట్టినింటిలో వదిలాడు. గురువారం ఉదయం విధులకు బెంగుళూరుకు వెళ్తుండగా ప్రమాదంలో ఈయన మరణించాడు.

కుటుంబాన్ని వదిలి కూలి పనులకు..

ఓబుళదేవరచెరువు మండలం మలకవారిపల్లి గ్రామానికి చెందిన నారాయణప్ప కూలి పనుల నిమిత్తం బెంగుళూరుకు వెళ్తుంటాడు. కుటుంబ సభ్యులు స్వగ్రామంలోనే ఉంటారు. దసరా పండుగ సందర్భంగా సొంత గ్రామానికి వచ్చాడు. పండుగ అనంతరం బెంగుళూరుకు వెళ్లేందుకు స్వగ్రామం నుంచి బస్సులో గోరంట్లకు వచ్చి అక్కడ బెంగుళూరుకు వెళ్లే సుమోలో ఎక్కాడు. ప్రమాదం చోటు చేసుకోవడంతో ఈయన మరణించాడు.

సామాజిక సాధికార బహిరంగ సభలో అభివాదం చేస్తున్న వైసిపి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు

జగన్‌తోనే 'సామాజిక సాధికారత'

◆వచ్చే ఎన్నికల్లో అండగా ఉంటాం ◆'అనంత' సామాజిక సాధికార బస్సు యాత్రలో వైసిపి నేతలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సామాజిక సాధికారత ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైసిపి నేతలు పేర్కొన్నారు. వైసిపి ఆధ్వర్యంలో చేపట్టిన రాయలసీమ ప్రాంత 'సామాజిక సాధికార బస్సుయాత్ర' అనంతపురం జిల్లాలో ప్రారంభమైంది. గురువారం ఉదయం శింగనమల మండల కేంద్రంలో ప్రారంభమైన యాత్ర కొర్రపాడు, రోటరీపురం మీదుగా బుక్కరాయసముద్రం వరకు కొనసాగింది. శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, బాపట్ల పార్లమెంటు సభ్యులు నందిగామ సురేష్, అనంతపురం పార్లమెంట్ సభ్యులు తలారి రంగయ్య, హిందూపురం పార్లమెంట్ సభ్యులు గోరంట్ల మాధవ్, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంజాద్‌బాషా మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు బీసీ,ఎస్సీ,ఎస్టీలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూసారని విమర్శించారు. సామాజిక సాధికారత వారి హయాంలో నిర్లక్ష్యానికి గురైందన్నారు. వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీలను మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా, ఎమ్మెల్సీగా చేశారన్నారు. ఎపిలో ముస్లిం మైనార్టీలను ఉపముఖ్యమంత్రిని చేయడం ఒక చరిత్ర అన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలతోనే తమ పొత్తు అని చెప్పారు. కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ అబద్ధపు మాటలతో మరోమారు ప్రజలను మోసం చేయాడానికి టిడిపి, జనసేనలు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. జైలుకెళ్లిన తరువాత చంద్రబాబునాయుడుకి ప్రజలు గుర్తుకొస్తున్నారని ఎద్దేవా చేశారు. తమ హయాంలో బీసీ,ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చామన్నారు. ఈ నాలుగున్నరేళ్ల కాలంలో వారి కోసం రెండు లక్షల కోట్ల రూపాయలను ఖర్చు చేశామని వివరించారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి మరోమారు ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమ ఫలాలు ప్రజలకు అందుతాయన్నారు. పేదల సంక్షేమానికి ఆయన కట్టుబడి పనిచేసే వ్యక్తి అని పేర్కొన్నారు. టిడిపి ఇస్తున్న హామీలను నమ్మి మోసపోవద్దన్నారు. బాపట్ల పార్లమెంటు సభ్యులు నందిగామ సురేష్ మాట్లాడుతూ పేదల వైపు నిలబడే మనిషి జగన్మోహన్‌రెడ్డి అని తెలిపారు. పేదలకు మంచి చేయడానికెళ్తే కోర్టుల ద్వారా వాటిని అడ్డుకునే ప్రయత్నాలను టిడిపి చేసిందని విమర్శించారు. వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని ఎదుర్కొవడం లోకేశ్‌కు చేతకాదని ఎద్దేవా చేశారు. న్యాయాన్ని గెలిపించాలని భువనేశ్వరీ అడగాల్సిన అవసరం లేదని... చంద్రబాబు విషయంలో న్యాయమే గెలుస్తుందని చెప్పారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చెబుతున్న మాయ మాటలను నమ్మి మోసపోవద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్యతో ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన వైసిపి ఎమ్మెల్యేలు, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బహిరంగ సభకు హాజరైన వైసిపి కార్యకర్తలు

వైసీపీ దగాకోరుల దండయాత్ర

మాజీ మంత్రి కాలవ మండిపాటు

కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-అనంతపురం

బలహీన వర్గాల సంక్షేమానికి సమాధి కట్టిన నయవంచకులు వైసిపి నాయకులని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు మండిపడ్డారు. నగరంలోని ఎంవైఆర్ కళ్యాణ మండపంలో గురువారం సాయంత్రం జరిగిన శింగనమల నియోజకవర్గ టిడిపి విస్తత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం అక్కడే వైసీపీ సామాజిక బస్సుయాత్రకు నిరసనగా పార్టీ నాయకులతో కలిసి నల్ల బెలూన్లను ఎగురవేశారు. మోసకారి సంక్షేమంతో బడుగుల భవిష్యత్తును సర్వనాశనం చేస్తున్న వైసిపి మంత్రులకు బలహీన వర్గాల పేరెత్తే నైతిక అర్హత లేనేలేదని విమర్శించారు. అది సామాజిక బస్సుయాత్రలా లేదని వైకాపా దగాకోరుల దండయాత్రలా ఉందన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం నలుగురు రెడ్ల చేతుల్లో నలుగుతోందని దుయ్యబట్టారు. సీఎం. బాబాయ్ వైవి సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి, సజ్జల రామకష్ణారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనే దుష్టచతుష్టయం రాష్ట్రాన్ని పీల్చిపిప్పి చేస్తోందన్నారు. పాలనలో ఎలాంటి భాగస్వామ్యం లేని ఉత్సవ విగ్రహాల్లాంటి బీసీ, ఎస్సీ మంత్రులు సామాజిక బస్సుయాత్ర పేరుతో ఏముఖం పెట్టుకుని ప్రజల దగ్గరకొస్తున్నారని నిలదీశారు. జగన్ రెడ్డి నాలుగున్నరేళ్ల పాలనలో బడుగుల సంక్షేమం నిర్లక్ష్యపు ఉరికొయ్యకు వేలాడుతోందన్నారు. బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనారిటీ కార్పొరేషన్లలో స్వయం ఉపాధి పథకాలను పూర్తిగా ఎత్తివేసి, అట్టడుగువర్గాల అభ్యున్నతిని దారుణంగా దెబ్బతీశారన్నారు. సీఎం. జగన్ తన పెత్తందారీ పోకడలతో బీసీ నాయకులను అణచివేస్తున్నారని ఆరోపించారు. స్థానిక సంస్థల రిజర్వేషన్లలో పది శాతం కోత విధించి 16వేల పైచిలుకు పదవులను బీసీలకు జగన్ దూరం చేశాడన్నారు. దళితులకు వ్యవసాయ భూములు కొనుగోలు చేసి కూలీలను రైతులుగా మార్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. అలాంటి శాశ్వత పనులు, పేదల ఆర్థిక స్థితిని పెంచే కార్యక్రమాలు ఇప్పుడెందుకు జరగడం లేదని కాలవ ప్రశ్నించారు.

28న వాల్మీకి రాష్ట్రస్థాయి జయంత్యుత్సవం

ప్రజాశక్తి-అనంతపురం

వెనుకబడిన తరగతుల సంక్షేమ, వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి రాష్ట్రస్థాయి జయంతి ఉత్సవాలను ఈ నెల 28వ తేదీన నిర్వహిస్తున్నట్లు వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారిత అధికారి ఖుష్బు కొఠారి తెలిపారు. ఉదయం 10 గంటలకు పాతూరు విద్యుత్ కార్యాలయం సమీపంలోని వాల్మీకి విగ్రహానికి పుష్పాలంకరణ, మహిళలతో బోనాల ఊరేగింపు ఉంటుందన్నారు. 11 గంటలకు నగరంలోని కెఎస్‌ఎన్ ప్రభుత్వ మహిళా కళాశాలలో జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈసందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలనూ నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. వాల్మీకులు, ప్రజలు ఈకార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

విపిసి శుద్ధ జల ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రుద్రంపేట పంచాయితీ చంద్రబాబు కొట్టాలలో మాజీ శాసనసభ్యులు వైకుంఠం ప్రభాకర్ చౌదరి సహకారంతో ఎస్‌ఎం.బాషా శుద్ధ జల కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. సరిపూటీ రమణ, నారాయణ స్వామి యాదవ్‌ల ఆధ్వర్యంలో దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎం.బాషా మాట్లాడుతూ చంద్రబాబు కొట్టాల వాసులకు తక్కువ ధరకు శుద్ధ జలాన్ని అందించాలనే ఆలోచనతో ప్లాంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. వైకుంఠం ప్రభాకర్ చౌదరి ఆధ్వర్యంలో కాలనీ వాసులకు సురక్షితమైన మంచినీరు అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు షణ్ముఖ, బంగి నాగ, బొమ్మినేని శివ, బోయపాటి బాలప్ప, గంగవరం బుజ్జి, అంజి, మారుతి నాయుడు, నాగరాజు, తాహిర్, వెంకటేష్, కుమార్, బండి ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

శుద్ధ జల ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి
www.prajasakti.com

సంఘీభావం తెలుపుతున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

8న విద్యాసంస్థల రాష్ట్ర బంద్

ప్రజాశక్తి-ఉరవకొండ

కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు, విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఈ నెల 8వ తేదీ చేపడుతున్న రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలో గురువారం ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎఫ్, ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శులు పరమేష్, కుళ్లాయిస్వామి, సంతోష్‌కుమార్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లాభాలు వస్తున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రయివేటీకరణ చేయాలనే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎఐఎస్‌ఎఫ్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు రమణయ్య, ఆనంద్ కుమార్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు చందు, హిరణ్య, సురేష్, టిఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు ధనరాజ్, ఆర్‌ఎస్‌యు నాయకులు భీమేష్, ఎస్‌జెఎస్‌ఎఫ్ నాయకులు స్వర్ణసాగర్, ఎఐఎస్‌ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి చిరంజీవి, జిల్లా కార్యవర్గ సభ్యులు చందు, నాయకులు హారుణ్, రషీద్, లెనిన్, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

బండమీదపల్లి ఆర్‌బికె తనిఖీ

ప్రజాశక్తి-శింగనమల

వ్యవసాయ సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ

మండల పరిధిలోని సి.బండమీదపల్లి రైతు భరోసా కేంద్రాన్ని గురువారం జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ సందర్శించారు. సోషల్ ఆడిట్ నేపథ్యంలో ఖరీఫ్ సాగు నమోదు జాబితాని ఆర్‌బికెలో ప్రదర్శించారా లేదా అని వ్యవసాయ సిబ్బందిని విచారించారు. అక్కడే ఉన్న రైతులను వారి పంట సాగు వివరాలు సరి చూసుకోవాలని సూచించారు. పంట సాగు చేసి ఉండీ రైతులకు అభ్యంతరాలు ఉంటే సంబంధిత ఆర్‌బికెలో సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. సోషల్ ఆడిల్ 29వ తేదీ వరకూ ఉంటుందని తెలిపారు. అనంతరం రికార్డులను పరిశీలించి, ఎరువుల అమ్మకాల గురించి తెలుసుకున్నారు. ఆర్‌బికెలో రైతులకు కావాల్సిన ఎరువులను అందుబాటులో ఉంచి అమ్మకాలు మరింత పెంచాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట ఎఒ అన్వేష్‌కుమార్, ఎంపిఇఒలు, రైతులు ఉన్నారు.

ఆర్‌బికెల్లో పంట నమోదు జాబితా

ప్రజాశక్తి-గుత్తి

రైతులు సాగు చేసిన పంటల నమోదు జాబితాను రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు ప్రదర్శించాలని వ్యవసాయ సహాయ సంచాలకులు(ఎడిఎ) ఎం.వెంకటరాముడు ఆదేశించారు. మండల పరిధిలోని జక్కలచెరువు, తొండపాడు గ్రామాల ఆర్‌బికెలను గురువారం ఆయన సందర్శించారు. అనంతరం గ్రామసభలు నిర్వహించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకూ ప్రతి ఆర్‌బికెలో పంటల నమోదు జాబితాను ప్రదర్శనకు ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. రైతులకు అభ్యంతరాలు ఉంటే మార్పులు, చేర్పులకు అవకాశం ఉందన్నారు. ఆయన వెం విఎఎ, విహెచ్‌ఎలు ఉన్నారు.

ప్రజాశక్తి వార్తకు స్పందన

పంట నష్టపోయాక మేల్కొన్న అధికారులు

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

'ఆముదం పంటకు తెగుళ్లు' శీర్షికన గురువారం ప్రజాశక్తిలో ప్రచురితమైన వార్తకు వ్యవసాయ అధికారు లు స్పందించారు. అయితే ఇప్పటికే దున్నేసిన పంటకు, మిగిలిన పంటకు ఏ పురుగు మందులు వాడాలో రైతులకు సలహాలు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉంది. క్షేత్రస్థాయిలో ఏమాత్రం పట్టించుకోని అధికారులు ఈ-కెవైసి ప్రక్రియలో మాత్రమే నిమగ్నమై పంట పూర్తిగా నాశనమైన తర్వాత రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వడం విమర్శలకు తావిస్తోంది. ప్రజాప్రతినిధుల దగ్గర మార్కులు వేయించుకోవడానికి తాపత్రయమే తప్ప రైతుల పట్ల కానీ వ్యవసాయం అభివృద్ధి పట్ల కానీ ఎలాంటి అంకితభావం లేదని రైతులు మండిపడుతున్నారు.

వలస కూలీల మృతి దిగ్భ్రాంతికరం

జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్

ప్రజాశక్తి-అనంతపురం

సొంతూరిలో కుటుంబ సభ్యుల మధ్య దసరా పండుగ చేసుకుని తిరిగి పొట్టకూటి కోసం బెంగళూరుకు వలస వెళ్తున్న కూలీలు కర్నాటకలోని చిక్బల్లాపూర్ సమీపంలో ఘోర ప్రమాదానికి గురై 13 మంది మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్ గురువారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండల సమీప గ్రామాలకు చెందిన వారు దసరా పండుగకు స్వగ్రామాలకు వచ్చి తిరిగి బెంగళూరులో కూలి పనులకు వెళ్లే సమయంలో వారు వెళ్తున్న వాహనం ఆగి ఉన్న లారీని ఢీ కొట్టిందన్నారు. ప్రమాదంలో మృతి చెందిన వారందరికీ జనసేన తరపున అశ్రునివాళి అర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులకు జనసేన పార్టీ ప్రగాఢ సానుభూతి తెలుపుతోందన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని ఆయన కోరారు.

మట్టి తరలింపు

ప్రజాశక్తి-పుట్లూరు

ఎంపిడిఒ యోగానందరెడ్డికి మట్టి ఉన్న కలశం అందజేస్తున్న దృశ్యం

మండల పరిధిలోని 23 గ్రామ పంచాయతీల నుంచి సేకరించిన పవిత్ర మట్టిని ఇత్తడి కలశంలో ఉంచి అనంతపురం నగరంలోని నెహ్రూ యువ కేంద్రం డైరెక్టర్‌కి గురువారం అందజేసినట్లు ఎంపిడిఒ యోగానందరెడ్డి తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అన్ని మండలాల నుంచి సేకరించిన పవిత్ర మట్టి ఉంచిన అమృత కలశాలను నేడు మధ్యాహ్నం ధర్మవరం నుంచి నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో విజయవాడకు తీసుకెళ్తారన్నారు. 28వ తేదీ విజయవాడ నుంచి ప్రత్యేక రైలులో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి తరలించిన అమృత కలశాలను ఢిల్లీకి పంపుతారన్నారు. న్యూఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో ఈ నెల 30, 31 తేదీల్లో నిర్వహించే స్వాతంత్ర్య అమృతోత్సవాల్లో అందిస్తారని ఎంపిడిఒ తెలిపారు.

29న తిరుపతిలో ఏపి రెడ్డి సంఘం వార్షికోత్సవం

ఏపి రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నరేష్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు

ఈ నెల 29వ తేదీ(ఆదివారం) తిరుపతి నగరంలోని రెడ్డి భవనంలో నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం 5వ వార్షికోత్సవ సభను విజయవంతం చేయాలని ఏపి రెడ్డి సంఘం రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు గంగుల కుంట నరేష్‌కుమార్‌రెడ్డి, రేనాటి నాగేశ్వర్‌రెడ్డి, నాయకులు గట్టిరెడ్డి భయపురెడ్డి, రామకృష్ణారెడ్డి గురువారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. సంఘం ఏర్పాటైనప్పటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో కార్యక్రమాలు చేపట్టారన్నారు. ముఖ్యంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 70 లక్షల మంది రెడ్ల ఐక్యత కోసం రాజకీయాలకు అతీతంగా అన్ని ప్రాంతాల్లో రెడ్ల ఐక్యత సభలు, గ్రామస్థాయిలో రెడ్ల ఐక్య చైతన్య యాత్రలు నిర్వహించారన్నారు. అందరి సహకారంతో భవిష్యత్తులో మరిన్ని పోరాటాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించి రెడ్ల ఐక్యత, హక్కుల సాధన కోసం సంఘం కృషి చేస్తుందన్నారు. సంఘం అభివృద్ధిలో భాగస్వాములైన రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులు, ప్రతినిధులు, రెడ్డి బంధువులు ప్రతి ఒక్కరూ వార్షికోత్సవ సభకు హాజరుకావాలని ఆయన కోరారు.

ప్రజలకు జరిగిన మేలును వివరించేందుకే 'సామాజిక సాధికార యాత్ర'

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

పౌష్టికాహార ప్రదర్శనను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

నాలుగున్నరేళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఏం చేశామో వివరించడానికే రాష్ట్ర వ్యాప్తంగా 'సామాజిక సాధికార బస్సు యాత్ర'లు ప్రారంభించామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి స్పష్టం చేశారు. ఎమ్మెల్యే గురువారం నగరంలోని పాతూరు పవర్ ఆఫీస్, ఖాజానగర్‌లో నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాలను, ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పౌష్టికాహార ప్రదర్శనను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారం అనేది చలాయించడానికి కాదని, సేవ చేయడానికని నిరూపిస్తున్న ఘనత వైసిపి ప్రభుత్వానిదని తెలిపారు. సిఎం జగన్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారని, సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. సిఎం జగన్, వైసిపి పట్ల ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంటే ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలు కుట్రలు చేస్తున్నాయని మండిపడ్డారు.

సానుభూతి కోసమే నారా భువనేశ్వరి 'నిజం గెలవాలి' యాత్ర

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సానుభూతి కోసమే నారా భువనేశ్వరి 'నిజం గెలవాలి' పేరుతో యాత్ర చేస్తున్నారని ఎమ్మెల్యే అనంత విమర్శించారు. చంద్రబాబు తప్పు చేశారు కాబట్టే జైలుకెళ్లారన్నారు. సుప్రీం కోర్టుకు వెళ్లినా ఊరట దక్కడం లేదన్నారు. ఇన్నాళ్లు చంద్రబాబు వ్యవస్థలను అడ్డుపెట్టుకుని కోర్టు స్టేలతో జీవితం గడిపారన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్డు, రాజధాని, ఫైబర్ గ్రిడ్‌లోనూ చంద్రబాబు అక్రమాలకు పాల్పడ్డారన్నారు. చంద్రబాబు అరెస్ట్ పట్ల ప్రజల్లో స్పందన లేకపోవడంతో జిమ్మిక్కులు చేస్తున్నారన్నారు. ఏ పార్టీతో ఎవరు కలిసినా తమకు వచ్చిన నష్టమేమీ లేదన్నారు. ఎమ్మెల్యే వెంట మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వక్ఫ్ బోర్డు ఛైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, కార్పొరేటర్లు లావణ్య, చంద్రలేఖ, జయలలిత, శ్రీనివాసులు, కమల్, ఇసాక్, ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు సాకే కుళ్లాయిస్వామి, వైసిపి నాయకులు బోయ చంద్రశేఖర్(చిన్నా), పవన్‌కుమార్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

కరువు సహాయక చర్యలు చేపట్టాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ఉరవకొండ

ఎండిన కందిపంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేశవ్, టిడిపి నాయకులు

రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కరువు తీవ్రతను అంచనా వేసి రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని ఎమ్మెల్యే, పిఎసి ఛైర్మన్ పయ్యావుల కేశవ్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని షేక్షానుపల్లి, లత్తవరం గ్రామాల్లో ఎండిన కంది, పప్పుశనగ, తదితర పంటలను గురువారం ఎమ్మెల్యే పరిశీలించి రైతుల సమస్యలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు సాగు చేసిన పంటలు పూర్తిగా ఎండిపోయాయని, కనీసం పెట్టుబడులు కూడా తిరిగి రాని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. మరోవైపు సాగునీరు కూడా సకాలంలో అందకపోవడంతో చేతికొచ్చిన పంటలు ఎండిపోతున్నాయన్నారు. బావులు, బోర్ల కింద సాగుచేసిన పంటలు కూడా విద్యుత్ కోతల వల్ల ఎండిపోవడం బాధాకరమన్నారు. రాష్ట్రాన్ని కరువు మేఘాలు కమ్ముకుని అన్నదాత ఆక్రందనలో ఉన్నప్పటికీ ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడంలో విఫలమైందన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి సహాయక చర్యలను చేపట్టాలని కోరారు. ఆయన వెంట పార్టీ నాయకులు, రైతులు ఉన్నారు.

'ఉపాధి' పనులు ప్రారంభించాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు

సచివాలయ అధికారికి వినతిపత్రం ఇస్తున్న వ్యకాసం నాయకులు

మండల వ్యాప్తంగా వెంటనే ఉపాధి హామీ పనులు చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బండారు శివ డిమాండ్ చేశారు. నిరుపేదల కోసం ఉపాధి హామీ పనులు చేపట్టి వలసలను నియంత్రించాలని కోరుతూ గురువారం వ్యకాసం ఆధ్వర్యంలో స్థానిక సచివాలయంలో వినతి పత్రం అందజేశారు. బండారు శివ, సిపిఐ మండల కార్యదర్శి సనప నీళ్ల పాల రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టానికి ప్రత్యేక నిధులు, 200 రోజుల పని దినాలు, రోజు వేతనం రూ. 600, వ్యవసాయ కూలీలు, పేద లకు నెలకు రూ. 10వేల కరువు పింఛన్, 35 కిలోల బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు, పేద విద్యార్థులకు అన్ని రకాల ఫీజుల రద్దు, పేదల ఇళ్లకు విద్యుత్ ఛార్జీలు, బకాయిల రద్దు, పంట సాగు చేసి నష్టపోయిన రైతులకు పరిహారం, అన్ని రకాల బ్యాంకు రుణాల రద్దు చేసి కొత్త రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆత్మకూరు, నారాయణపురం, చోళసముద్రం, కమ్మూరు, ఇప్పేరు, తదితర పంచాయతీల్లో సచివాలయ అధికారు లకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వ్యకాసం రాప్తాడు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బి.రామాంజనే యులు, ముత్యాలు, హనుమన్న, మహిళా సమాఖ్య సభ్యురాలు సరస్వతి, నారాయణమ్మ, గోవిందు, శంకరయ్య, మధు పాల్గొన్నారు.

'వై ఎపి నీడ్స్ జగన్'ను ప్రజల్లోకి తీసుకెళ్దాం

ప్రజాశక్తి-ఉరవకొండ

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

'వై ఎపి నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి వై.విశ్వేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. నవంబర్ 1 నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు చేపట్టనున్న ఈ కార్యక్రమంపై గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో వజ్రకరూరు, విడపనకల్లు మండలాల ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. విశ్వ మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనకు, వైసిపి పాలనకు ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలకు తెలియజేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు. అందరూ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మార్కెట్ యార్డు కమిటీ ఛైర్‌పర్సన్ సుశీలమ్మ, ఆయా మండలాల అధ్యక్షులు సోమశేఖర్‌రెడ్డి, బసన్న, విడపనకల్లు జడ్పిటిసి హనుమంతు, నాయకులు కరణం భీమరెడ్డి, వెంకటరెడ్డి, ఉస్మాన్, నారాయణప్ప, సామానాయక్, భీమ, కృష్ణ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి

పట్టణంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి హామీ ఇచ్చారు. పట్టణంలోని 11వ వార్డు అరబిక్ స్కూలు సమీపంలో నూతనంగా నిర్మించిన మినీ సిస్టం వాటర్ ట్యాంకును గురువారం నియోజకవర్గ ఇంచార్జ్,మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ప్రారంభించారు. ముందుగా సర్పంచి లలిత, ఎంపిపి చందా చంద్రమ్మ, జడ్పిటిసి పార్వతమ్మ, వైస్ ఎంపిపి నరసింహులు, ఉప సర్పంచి వన్నప్ప, పట్టణ కన్వీనర్ ఎసి ఎర్రిస్వామి, మండల సమన్వయకర్త ఓబన్న, తదితరులు విశ్వకు ఘనంగా స్వాగతం పలికి పూలమాలలు, శాలువాతో సత్కరించారు. అనంతరం గ్రామ పంచాయతీ నిధులు రూ. 1 లక్షతో ఏర్పాటు చేసిన సిస్టం ట్యాంకుకు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోవిందు, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షులు బసవరాజు, జెసిఎస్ పట్టణ కన్వీనర్ ఆసిఫ్, వార్డు సభ్యురాలు గుత్తి భాను, సచివాలయ కన్వీనర్లు అన్వర్, వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

అన్యాక్రాంత ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలి : సిపిఎం

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

పట్టణ శివారులోని హనుమాన్ జంక్షన్‌లో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. నాయకులు మాట్లాడుతూ సర్వే నెంబర్-424-బి లో ఉన్న ప్రభుత్వ స్థలంలో 2008లో సిపిఎం ఆధ్వర్యంలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని జెండాలు నాటామన్నారు. ఈ భూ పోరాటంలో భాగంగా నాయకులు భార్యా పిల్లలకు దూరమై జైలు జీవితం కూడా గడిపారని తెలిపారు. అయితే స్థానిక రెవెన్యూ అధికారులు సామాన్య ప్రజల కోసం జీవితాన్ని త్యాగం చేసిన నాయకుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ ఓ వ్యక్తి ప్రయోజనాల కోసం పని చేయడం దారుణమన్నారు. ఇకనైనా ఆ భూమిని పేదలకు పంచాలని, లేదా ప్రజా ప్రయోజనార్థం ఉపయోగించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, దాసరి శ్రీనివాసులు, నాయకులు సాకే నాగరాజు, కసాపురం రమేష్, తిమ్మప్ప, జాకీర్ హుస్సేన్, రాముడునాయక్, ఓబులేసు, అబ్దుల్లా, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ బుకింగ్‌కు మరో అవకాశం

ప్రజాశక్తి-బొమ్మనహాల్



ఎఒ సాయికుమార్

మండల పరిధిలోని రైతులు వారి పొలాల్లో సాగు చేసిన పంట వివరాలను ఈ క్రాప్ బుకింగ్ చేసుకునేందుకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి(ఎఒ) సాయికుమార్ సూచించారు. స్థానిక ఎఒ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకూ ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోని రైతులు వారి పరిధిలోని ఆర్‌బికెలో వ్యవసాయ అధికారులను సంప్రదించి పంట వివరాలు, సర్వే నెంబరు, ఆధార్, బ్యాంకు ఖాతా పాసు పుస్తకం జిరాక్స్ పత్రాలను అందజేసి ఈ-క్రావ్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి వ్యవసాయ అధికారి గోపాల్, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక సాధికార యాత్రకు తరలిన వైసిపి శ్రేణులు

పుట్లూరు : బుక్కరాయసముద్రంలో నిర్వహించిన సామాజిక సాధికార యాత్రకు మండలం నుంచి వైసిపి నాయకులు, కార్యకర్తలు గురువారం తరలివెళ్లారు. జంగంరెడ్డిపేట సర్పంచి రామంజులరెడ్డి ఆధ్వర్యంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజలు వాహనాల్లో తరలివెళ్లారు.

సామాజిక సాధికార యాత్రకు బస్సులో బయల్దేరిన వైసిపి శ్రేణులు

జెండా కట్ట వద్ద ఎమ్మెల్యే ప్రార్థనలు

గుత్తి : మండల పరిధిలోని రజాపురం గ్రామంలో ఉన్న మాబుసుబాని జెండా కట్ట వద్ద గురువారం జరిగిన గంధం కార్యక్రమానికి ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముందుగా గ్రామంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట వైసిపి నాయకులు కేశవులు, చిన్న షేక్షావలి, హాజీ, మలంగ్ బాబా, మహాలింగ, మదనరాజు, ఎర్రిస్వామి, యోగేశ్వర నాయుడు, దాదా ఖలందర్, మహబూబ్‌బాషా, కృష్ణ ఉన్నారు.

జెండా కట్టకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి

గొర్రెల పెంపకంపై అవగాహన

బెలుగుప్ప : కళ్యాణదుర్గం పట్టణంలో గురువారం గొర్రెల పెంపకంపై కాపరులు, రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డిప్యూటీ డైరెక్టర్ శాంతయ్య, ఉరవకొండ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశులు హాజరై మాట్లాడారు. అధునాతన యాజమాన్య పద్ధతుల్లో భాగంగా ఎలివేటెడ్ షర్టు ద్వారా గొర్రెలు, మేకలు పెంచితే మంచి లాభాలు పొందవచ్చని తెలిపారు. రోగాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిం చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్‌గుప్తా, కర్నూలు అసిస్టెంట్ డైరెక్టర్ రామసుబ్బారెడ్డి, పశు వైద్యాధికారి రమేష్, సిబ్బంది రామ్మూర్తి, సతీష్, పశు వైద్య సిబ్బంది, రైతులు, గొర్రెల కాపరులు పాల్గొన్నారు

గొర్రెల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని మహిళ మృతి

ప్రజాశక్తి-బెళుగుప్ప

మండల పరిధిలోని నరసాపురం క్రాస్ వద్ద బుధవారం రాత్రి గుర్తు తెలియని మహిళ(50) తీవ్ర గాయాల తో పడి ఉండగా అటుగా వెళ్తున్న వారు గుర్తించి 108కి సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని హుటాహుటిన ఆమెను కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఎస్‌ఐ రామకష్ణయ్య మాట్లాడుతూ ఆమెను తెలంగాణకు చెందిన సరస్వతిగా గుర్తించామన్నారు. రాయదుర్గం ప్రభుత్వాసుపత్రిలో పదేళ్లకు పైగా స్వీపర్‌గా పని చేస్తూ కాలం గడిపేదన్నారు. ఆమెకు సంబంధించి ఎవరైనా ఉంటే 9440901863 నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు. ఆమె మృతిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సెల్‌ఫోన్లకు మెసేజ్‌లు.. అయోమయంలో ప్రజలు

ప్రజాశక్తి-నార్పల

ఆధార్ సంఖ్య
XXXXXXXX7573 కోసం
గుర్తింపు & చిరునామా
పత్రాలను సమర్పించండి.
14 Dec వరకు
myaadhaar.uidai.gov.in/du/te/TFZti లో
ఉచితం. ఆధార్ కేంద్రాల
లో ఛార్జీలతో సేవలు
అందుబాటులో ఉన్నాయి.
టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ 1947
-UIDAI

ప్రజల సెల్‌ఫోన్‌కు వచ్చిన మెసేజ్

మండల వ్యాప్తంగా నాలుగు రోజుల నుంచి చాలా మంది వ్యక్తులకు చిరునామా, గుర్తింపు కోసం ఆధార్ కేంద్రాల్లో సంబంధిత పత్రాలు సమర్పించాలంటూ సెల్‌ఫోన్లకు సంక్షిప్త సమాచారాలు వస్తున్నాయి. ఈ మెసేజ్ లు ఎవరు పంపుతున్నారు, నిజంగానే గుర్తింపు కోసం ఆధార్ కేంద్రాల్లో పత్రాలు సమర్పించాలా లేక ఎవరైనా సైబర్ నేరగాళ్లు పంపుతున్నారా అని ప్రజలు అయోమయంలో ఉన్నారు. ఇటీవల కాలంలో మండలం లో చాలా మంది బ్యాంకు ఖాతాల నుంచి వారి ప్రమేయం లేకుండానే వేలిముద్రలు వేసి నగదు డ్రా చేసిన కేసులు అధికమ య్యాయి. దీంతో ప్రజలు ఆధార్ కేంద్రాల్లో గుర్తింపు పత్రాలు ఇవ్వడానికి ఆలోచిస్తున్నారు. ఈ మెసేజ్‌లకు సంబంధించి మండల ప్రజల సందేహాలను అధికారులు నివృత్తి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించేందుకే రీ సర్వే

ప్రజాశక్తి-బొమ్మనహాల్

రైతులతో మాట్లాడుతున్న తహశీల్దార్ శ్రీనివాసులు

స్థానిక సచివాలయంలో గురువారం తహశీల్దార్ శ్రీనివాసులు రీ సర్వే మూడో విడత జాబితాను విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో తహశీల్దార్ మాట్లాడుతూ రైతుల సమస్యలను పరిష్కరించేం దుకు రాష్ట్ర ప్రభుత్వం రీసర్వే కార్యక్రమం చేపట్టిందని, మూడో విడతగా నాలుగు రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేసిందన్నారు. అందులో మొదటిసారిగా బొమ్మనహాల్ రెవెన్యూ విలేజ్‌ను పూర్తి చేశామన్నారు. రైతుల కోసం సర్వే జాబితాను సచివాలయంలో అందుబాటులో ఉంచామన్నారు. స్పెషల్ సర్వేయ ర్ డిపి సుజాత మాట్లాడుతూ రైతులకు రీ సర్వే సువర్ణ అవకాశమని, రైతుల సహకారం వల్లే ఈ పనిని సులభంగా పూర్తి చేశామని తెలిపారు. సమావేశంలో సర్పంచి వన్నమ్మ, విఆర్‌ఒ తిమ్మప్ప, సర్వేయర్లు ఆనంద్, మనోజ్‌కుమార్, సచివాలయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు

ఈ-క్రాప్ జాబితాలో సవరణకు అవకాశం : ఎఒ

ఆత్మకూరు : ఈ క్రాప్ ఖరీఫ్-2023 సీజన్ సవరణకు ఆఖరి అవకాశం ఉందని, తుది జాబితా ప్రదర్శన తర్వాత ఎటువంటి మార్పులు, చేర్పులు చేయబడవని మండల వ్యయసాయ అధికారిణి(ఎఒ) సుచరిత గురువారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. మండలంలో 29,107 ఎకరాల్లో పంటల సాగు, ఈ-క్రాప్ ప్రక్రియ పూర్తయింద న్నారు. సామాజిక తనిఖీ కోసం రైతు భరోసా కేంద్రాల వద్ద ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకూ ఈ-క్రాప్ ముసాయిదా జాబితాను ప్రదర్శించడంతో పాటు గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. రైతులు జాబితాను పరిశీలించి, అభ్యంతరాలు ఉంటే సవరణకై మీ ఆర్‌బికెలో ఉన్న వ్యవసాయ అధికారులకు రాతపూర్వకంగా తెలపాలని సూచించారు.

వాల్మీకి జయంతి వేడుకలు బహిష్కరణ

ప్రజాశక్తి-పుట్లూరు

మల్లికార్జున

ఈ నెల 28వ తేదీ అనంతపురంలో ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న వాల్మీకి జయంతి వేడుకలను బహిష్కరిస్తున్నట్లు ఎపి వాల్మీకి బోయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వాల్మీకి మల్లికార్జున గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వైసిపి అధికారం చేపట్టి నాలుగున్నరేళ్లు గడిచినా వాల్మీకులకు చేసింఏమీ లేదని, వాల్మీకి కార్పొరేషన్‌కు ఒక్క రూపాయి నిధులు కేటాయించలేదన్నారు. అసెంబ్లీ మొదటి సమావేశాల్లోనే వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చుతామని హామీ ఇచ్చి, ఎన్నికల ముందు 4 జిల్లాల వాల్మీకులను గిరిజన జాబితాలో చేర్చుతున్నా మని ఓ చెల్లని తీర్మానం చేసి జాతిని వంచించిందన్నారు. అందుకు నిరసనగా వాల్మీకి జయంతి వేడుకలను యావత్ వాల్మీకి సమాజం బహిష్కరిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

ఈ-పంట జాబితాపై గ్రామసభలు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

ఈ-పంట జాబితాను ప్రదర్శిస్తున్న అధికారులు

ఖరీఫ్-2023 కి సంబంధించి ఈ పంట నమోదు జాబితాను ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకూ మండల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో గ్రామ సభలు నిర్వహించి వివరాలను ప్రదర్శించను న్నట్లు మండల వ్యవసాయ అధికారి(ఎఒ) మహేంద్ర తెలిపారు. రైతులకు సందేహాలు ఉంటే 30వ తేదీ లోపు తెలియజేయాల న్నారు. నవంబర్ 1వ తేదీ తుది జాబితా విడుదల చేస్తామన్నారు. గురువారం పల్లేపల్లి, మల్లాపురం, మెచ్చిరి ఆర్‌బికెల్లో గ్రామ సభలు నిర్వహించామని, మిగిలిన ఆర్‌బికెల్లో శుక్రవారం(నేడు) గ్రామసభలు నిర్వహిస్తామని తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని 4, 10 సచివాలయాల్లో గురువారం ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబి, కమిషనర్ జి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. శిబిరాల్లో పలువురికి వైద్య పరీక్షల నిర్వహించి మందులు అందజేశారు. వారు మాట్లాడుతూ 'జగనన్న ఆరోగ్య సురక్ష'ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి చెన్నకేశవులు, వైద్యులు బిందు, భార్గవి, ఎల్ల రాముడు, కృష్ణ ప్రసాద్, దివ్య, మున్సిపల్ మేనేజర్ మురళీధర్, ఇమామ్ హుస్సేన్, షేక్షావలి, సికె రామాంజనేయులు, కౌన్సిలర్ వి.వరదరాజులు, సచివాలయాల కన్వీనర్ ఎం.రంగస్వామి పాల్గొన్నారు.

'షష్టి పూర్తి' పోస్టర్ ఆవిష్కరణ

అనంతపురం : నవంబర్ 2వ తేదీ సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న షష్టి పూర్తి కార్యక్రమం పోస్టర్‌ను గురువా రం విశాఖపట్టణంలోని విశాఖ శారదా పీఠం పీఠాధిపతి స్వరుపానందేంద్రస్వామి, ఉత్తరాధికారి స్వాత్వనందేంద్ర స్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వరుపానందేంద్ర స్వామి షష్టి పూర్తి చేసుకుంటున్న జంటలకు మంగళ శాశనం చేశారు. స్వామీజీ మాట్లాడుతూ షష్టి పూర్తి కార్యక్రమం కార్యక్రమం నిర్వహిస్తున్న సాయి ట్రస్ట్‌ను అభినందించారు. సాయి ట్రస్ట్ అధ్యక్షుడు విజయ సాయికుమార్ మాట్లాడుతూ నవంబర్ 2వ తేదీ ఈ కార్యక్రమం నిర్వహి స్తున్నామని తెలిపారు.

షష్టి పూర్తి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న స్వరుపానందేంద్రస్వామి